క్లుప్తంగా

18న లాసెట్ పై అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధి నందిని క్లాత్ మార్కెట్‌లోని జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో ఈ నెల 18న ఉదయం తొమ్మిది గంటలకు లాసెట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శివారెడ్డి, సునీత ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో లాసెట్ రాసే అభ్యర్థులకు నిపుణులు తగిన సూచనలు, సలహాలందిస్తారన్నారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9441325909లో సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం



వెంకటసుబ్బమ్మకు నగదు అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

అట్లూరు : మండల పరిధిలోని అట్లూరు గ్రామానికి చెందిన చిట్టిబోయిన వెంకటసుబ్బమ్మ అనే పేద కుటుంబానికి కువైట్ యాదవ సంఘం తరపున శనివారం రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. చిట్టిబోయిన వెంకటసుబ్బమ్మ, వేణు దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పేదరికంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే కువైట్ యాదవ సంఘం అట్లూరు మండల అధ్యక్షుడు ఆవులపోలు మునెయ్య యాదవ సంఘం అధ్యక్షుడు చల్లాబాబుయాదవ్ దృష్టికి తీసుకెళ్ళడంతో ఆయన స్పందించి వెంకటసుబ్బమ్మ కుటుంబానికి రూ.30 వేలు నగదును కువైట్ నుండి పంపించడంతో శనివారం బద్వేలు మండల అధ్యక్షుడు బుర్రిరాజాయాదవ్, పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు నరసింహులు, సంద్రాశ్రీను, ఆవులపోలు వెంకటయ్య, వెంకటసుబ్బమ్మకు అందజేశారు.

మాజీ ఎమ్మెల్యేకు సత్కారం



రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సత్కరిస్తున్న రాయపురెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎంప్లాయీస్ అండ్ పింఛనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ప్రొద్దుటూరుకు చెందిన ఎద్దుల రాయపురెడ్డిని ఆ పార్టీ నియమించింది. ఈ సందర్భంగా శనివారం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని రాయపురెడ్డి కలిసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతులు సుఖసంతోషాలతో ఉండాలి



వెల్లాలలో భోజనాన్ని వడ్డిస్తున్న ఏఓ వెంకట కృష్ణారెడ్డి

రాజుపాళెం : సకాలంలో వర్షాలు పడి రైతులంతా సుఖ సంతోషాలతో ఉండాలని ముద్దనూరు మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకటకృష్ణారెడి ఆకాంక్షించారు. మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా వెంకటకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వారికి శాలువా కప్పి పూలమాల వేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఉత్సవ కమిటీ చైర్మన్ లక్ష్మినారాయణరెడ్డి ఏఓకు జ్ఞాపిక అందజేశారు. అన్నదాన కార్యక్రమానికి తన వంతు సాయంగా రూ.4016ను విరాళంగా ఇచ్చినట్లు ఏఓ చెప్పారు.

వీర సైనికుల కోసం పూజలు



పూజలు చేస్తున్న ముల్లా అస్మద్

ప్రొద్దుటూరు : దేశ రక్షణ కోసం జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ రాజుపాళెం మండల బీజేపీ అధ్యక్షుడు ముల్లా అస్మద్ ఆధ్వర్యంలో స్థానిక వెల్లాల సంజీవరాయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తులసీశ్వర్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, వీరభద్రారెడ్డి, రాజారెడ్డి, వెంకటకొండారెడ్డి పాల్గొన్నారు.

రాజుపాలెంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

చాపాడు : మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో శనివారం ఉదయం టీటీడీకి చెందిన ఇరువర్గాల వారు భూ తగాదా విషయంలో ఘర్షణ పడ్డారు. గ్రామానికి చెందిన పల్లె శ్రీనివాసులు, నలసింగ్ చిన్న కుళ్లాయప్ప వర్గీయుల పొలం వద్ద ఘర్షణ పడ్డారు. ఘర్షణలో ఇరువురికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తులకు ప్రొద్దుటూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మృత్యు తీగలు!

- యమపాశాలుగా మారుతున్న విద్యుత్ తీగలు
- ఇళ్ల వద్ద ప్రమాదకరంగా హైటెన్షన్ వైర్లు
- కొన్నిచోట్ల ప్రమాదకరంగా కేబుల్ వైర్లు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని విద్యుత్‌శాఖ



విద్యుత్ స్తంభానికి కట్టలు కట్టలుగా వేలాడుతున్న కేబుల్ వైర్లు, ఇంటర్‌నెట్ తీగలు



గాంధీనగర్‌లో ఓ ఇంటిపైన విద్యుత్ హైటెన్షన్ తీగలు

బద్వేలు : విద్యుత్ తీగలు యమపాశాలుగా మారుతున్నాయి. పలు చోట్ల స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. పలు ప్రాంతాల్లో తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. అయినప్పటికీ ట్రాన్స్‌కో అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. బద్వేలు పట్టణంలో అస్తవ్యస్థంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు వాటికి అమర్చిన విద్యుత్ తీగలు పట్టణ వాసులను హడలెత్తిస్తున్నాయి. విద్యుత్ స్తంభాలను రోడ్ల వెంట అమర్చిన డిష్ కేబుల్స్, ఇంటర్‌నెట్ తీగలు వాహనచోదకులను భయపెడుతున్నాయి. కాలనీలతో పాటు ప్రధాన రోడ్డు మార్గాల్లోని విద్యుత్ స్తంభాలకు కట్టలు కట్టలుగా వేలాడుతున్న కేబుల్ వైర్లు, ఇంటర్‌నెట్ తీగలు ఎప్పుడు తెగి ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం జనసంచారం ఉండే బద్వేలు నాలుగు రోడ్ల కూడలి, సిద్దవటం, నెల్లూరు, మైదుకూరు పాత బద్వేలు ప్రధాన రహదారులతో పాటు గాంధీ నగర్, వినాయక నగర్, శివరామక్రిష్ణా నగర్, ఎన్‌జీఓ కాలనీ తదితర చోట్ల విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేసిన కేబుల్ ప్రమాదకరంగా మారాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రైవేట్ సంస్థలు విద్యుత్ శాఖ స్తంభాలను తమ సొంతానికి వాడుకుంటున్నాయి. వాడవాడలా విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తుండగా.. కొన్ని ప్రైవేటు ఇంటర్నెట్, కేబుల్ టీవీ సంస్థలు ఇష్టారాజ్యంగా కేబుళ్లను స్తంభాల ద్వారా అనుసంధానిస్తున్నాయి. ఫలితంగా విద్యుత్ స్తంభాల వద్ద ఏదైనా సమస్య ఎదురైతే ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేయలేకపోతున్నారు. అనుమతులు లేకుండా కేబుళ్లు ఏర్పాటు చేస్తే సదరు వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్న నిబంధన ఉన్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రైవేటు సంస్థల కేబుల్ విస్తరణ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతోందన్న ఆరోపణలు వినబడుతున్నాయి.

ఇబ్బందిగా మారిన కేబుళ్లు

కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు లైన్‌మెన్లు తనిఖీ చేసి మరమ్మతులు చేయడం సహజం. కాగా, ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన కేబుళ్లతో వారు స్తంభాలు ఎక్కాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉంటుందో తెలియని పరిస్థితి. తరచూ విద్యుత్ తీగల్లో స్పార్క్ వచ్చి తీగలు కాలి కేబుళ్లపై పడి మంటలు చెలరేగిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ శాఖ తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. స్తంభాలకు కుప్పలు తెప్పలుగా కడుతున్న కేబుల్ వైర్లతో నష్టం వాటిల్లుతునప్పటికీ అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేలాడుతున్న కేబుల్ వైర్లు తొలగించి ప్రమాదాలు జరుగకుండా సంబంధిత విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి నత్తడ్‌షా వలి ఉరుసు మహోత్సవం



అగ్రహారంలోని నత్తడ్‌షావలి దర్గా

ఖాజీపేట : సర్వమత సమ్మేళనానికి నిదర్శనం అగ్రహారంలోని శ్రీ హజరత్ ఖాజా సయ్యద్ నత్తహర్‌షావలి రహమతుల్లా అలైహి దర్గ. ప్రతి ఏటా ఇక్కడ ఉరుసు ఉత్సవాలు కుల మతాలకు అతీతంగా అందరూ కలసి కట్టుగా నిర్వహిస్తుంటారు. ఉరుసుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై దర్గాను దర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

ఉరుసు ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఉరుసు ఉత్సవాల కోసం ప్రత్యేక ఏర్పాట్లను కమిటీ సభ్యులు ఇప్పటికే పూర్తి చేశారు. ఆదివారం నుంచి మొదలై మూడు రోజుల పాటు ఉరుసు ఉత్సవాలు జరుగుతాయి. ఉత్సవాలను ఖాజీపేట, సర్వర్ ఖాన్ పేటకు చెందిన ముస్లింలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఖాజీపేటకు చెందిన ముస్లింలు ఉరుసు నిర్వహిస్తున్నారు. గంధం, ఉరుసు రెండు రోజులు ప్రత్యేక ఖవ్వాలి నడుస్తుందని స్థానికులు చెబుతున్నారు.

బండలాగుడు పోటీలు

ఉరుసు ఉత్సవాన్ని పురస్కరించుకుని 13వ తేదీన బండలాగుడు పోటీలను కమిటీ సభ్యులు నిర్వహిస్తున్నారు. మొదటి బహుమతి రూ. 40వేలు, రెండవ బహుమతి రూ. 30వేలు, మూడవ బహుమతి రూ. 20వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు, ఐదవ బహుమతి రూ. 5వేలుగా కమిటీ సభ్యులు నిర్ణయించారు. అలాగే ఇంకా పలు బహుమతులను ఇవ్వనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు బచ్చల రాధా, శ్రీనివాసులు అన్నదానం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య

బద్వేలు అర్బన్ : రెవెన్యూశాఖలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ)లకు వారి విద్యార్హతల మేరకు ప్రభుత్వం పదోన్నతి కల్పించాలని ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లిపోగునాగేశం, కొమ్మద్ది ఈశ్వరయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్‌జీవో హోంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గుర్రాల హరిక్రిష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న వీఆర్‌ఏల సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో వీఆర్‌ఏలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అలాగే బద్వేలు రెవెన్యూ డివిజన్‌లో గల అన్ని తహసీల్దారు కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్ పోస్టులను అర్హత కలిగిన వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెల్లూరుసురేష్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుల్లయ్య, నాగసుబ్బయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మునికుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు గురవయ్య, రాజేష్‌కుమార్, ఏరియా గౌరవాధ్యక్షుడు వీరశేఖర్, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి పి.వి.రమణ, ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి బాలు, డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకుడు పి.వెంకటరమణ, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

మురళీనాయక్ త్యాగం మరువలేనిది



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బద్వేలు అర్బన్ : దేశ రక్షణలో వీరమరణం పొందిన మురళినాయక్ త్యాగం మరువలేనిదని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను పేర్కొన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో వీరమరణం పొందిన మురళినాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సత్యసాయి జిల్లా పెనుగొండ నియోజకవర్గంలోని గోరంట్ల మండలం కల్లి తాండాకు చెందిన మురళినాయక్ దేశసేవ చేయాలనే తలంపుతో 2022లో భారత సైన్యంలో చేరారని, అయితే దేశ రక్షణలో తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి చిన్న వయస్సులోనే అసువులుబాయడం బాధాకరమని, ఆ అమరవీరుని త్యాగాన్ని భారత జాతి మరువదని అన్నారు. వీరజవాన్ కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు ఎం.చిన్ని, మస్తాన్‌షరీఫ్, రాయప్ప, మోక్షమ్మ, అనంతమ్మ, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్డు పనులకు భూమిపూజ

ప్రొద్దుటూరు రూరల్ : సోములవారిపల్లె పంచాయతీ నందు రూ.78 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి శనివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ

మైదుకూరు : డీఎస్సీ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ జిల్లా సంచాలకులు డా.బి.రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. టెట్(టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్) పరీక్షలో అర్హత సాధించిన జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్(ఈబీసీ), ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన అభ్యర్థులకు మాత్రమే ఎస్జీటీ, ఎస్ఏ పరీక్షల కోసం ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇందుకోసం మార్చి 10వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. డీఎస్సీ ఆన్‌లైన్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసే వారు టెట్ పరీక్షలో అర్హత సాధించిన మార్కుల పత్రము, నేటి విటీ, కుల ధృవీకరణ పత్రం, అధార్ కార్డు , 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు దరఖాస్తుతో జత పరచాలని సూచించారు. దరఖాస్తులను ఏపీ బీసీ స్టడీ సర్కిల్, బీసీ భవన్ రెండవ అంతస్తు(ఓల్డ్ రిమ్స్), కడప అడ్రెస్‌లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9849919221, 9966418572 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు

బద్వేలు అర్బన్ : పని ప్రదేశంలో లైంగిక వేధింపులను నివారించేందుకు గాను బద్వేలు మున్సిపాలిటీలో అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా బద్వేలు మున్సిపాలిటీలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేసే కె.జ్యోతిలక్ష్మిని నియమించినట్లు ఆయన తెలిపారు. అలాగే సభ్యులుగా జూనియర్ అసిస్టెంట్లు జి.ప్రమీల, ఆర్.వరకుమారి, శ్రీకృష్ణదేవరాయనగర్ సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి ఎల్.మీనా, గాండ్లవీధి సచివాలయం వార్డు వెల్ఫేర్ సెక్రటరీ ఎస్.కనకదుర్గలను నియమించినట్లు ఆయన తెలిపారు. పురపాలక సంఘం కార్యాలయంలో, ఆయా సచివాలాయాల్లో మహిళలు వేధింపులకు గురైతే కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే కమిటీ సభ్యులు పోష్ చట్టంపై మహిళా ఉద్యోగులకు అవగాహన కల్పించాలని కోరారు.

లక్ష్మీనరసింహస్వామికి తైలాభిషేకం



భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైశాఖమాసం ఆరంభం నాల్గవ చివరి శనివారం శనిత్రయోదశి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక తైలాభిషేకం నిర్వహించారు. వచ్చిన భక్తులకు స్వామివారు నిజరూపంలో దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేటి నుండి బ్రహ్మోత్సవాలు

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుండి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. ఆలయ నిర్వాహకులు బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాటు చేశారు.

ఘనంగా లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి గ్రామ సమీపాన వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి, రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఆలయ ధర్మకర్త ఓబుల్‌రెడ్డిపార్థసారథిరెడ్డి కుమారులు వెంకటరామిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 7 నుండి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం స్వామివారికి చతుర్థానార్చనం, కుంభారాధనం, అగ్నిఆరాధన, నివేదనం, అర్చన, లఘుపూర్ణాహుతి, గోష్టితీర్థప్రసాదములతో మొదలై సాయంత్రం ఊంజాలసేవ నిర్వహించడంతో పాటు గరుడ వాహనంపై శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత రామలింగేశ్వరస్వామిలను మున్నెల్లి గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, ప్రజలు గ్రామోత్సవాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

13 నుంచి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు



చెన్నకేశవస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని మహాలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈ నెల 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. స్వామి, అమ్మవార్లకు నిత్యం విశేష అభిషేకాలు, అర్చనతోపాటు ప్రత్యేక అలంకరణ, జప హోమాలు చేయనున్నారు. 13న సింహవాహనంపై యోగనరసింహ స్వామిగా, 14న హనుమద్ వాహనంపై సీతారామలక్ష్మనులుగా, 15న శేష వాహనంపై యోగన రసింహస్వామిగా, 16న గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామిగా, 17న గజవాహనంపై వెంకటేశ్వర స్వామిగా అలంకరించనున్నారు. 18న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి రథోత్సవం, 19న అశ్వ వాహనంపై కొరడవేల అలంకారం, 20న హంస వాహనంపై డోపు ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు.

సింహ వాహనంపై చెన్నకేశవుడు



సింహ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి

రాజుపాళెం : మండలంలోని వెల్లాల చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి సింహవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి విగ్రహాలను ఊరేగించారు. ముందుగా ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పల్లకిలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వాములను అలంకరించి ఆశీనులు చేసి పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ రెడ్డి, వెంకటరమణ, రామమోహన్ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన అగస్త్యేశ్వరుడు



గరుడ వాహనంపై అగస్త్యేశ్వరుడు, అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గంగారాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తిని గరుడ వాహనంపై శనివారం ఘనంగా ఊరేగించారు. వేకువ జామున అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరిదేవికి అభిషేకాలు, అర్చనలు చేసి అలంకరించారు. గణపతిపూజ, కలశపూజ, బలిహరణ, మండపారాధన, దీక్షా హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం మైదుకూరు చెందిన టీవీ, రేడియో గాయకులు ఉపేంద్ర భాగవతార్ నిర్వహించిన పార్వతీ కళ్యాణం హరికథాగానం అందరినీ ఆకట్టుకుంది. స్వామి, అమ్మవారిని గరుడవాహనంపై, అభయ వరదా సీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తులకు నంది వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రామచంద్రాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

31న చలో సంగమేశ్వరం

మైదుకూరు : సిద్దేశ్వరం అలుగు నిర్మాణం కోసం ఈ నెల 31న చేపట్టనున్న చలో సంఘమేశ్వరం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రాష్ట్ర అభివృద్ధి వేదిక స్టేట్ కన్వీనర్ గంజికుంట నాగరాజు తెలిపారు. ఆయన శనివారం మండలంలోని మిట్టమానుపల్లె గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఏపీ అంటే అమరావతి, పోలవరం మాత్రమే కాదని అందని ఆంధ్రప్రదేశ్ అన్నారు.

విభజనలో పొందుపరిచిన అంశాలను అమలు చేయడంతో పాటు రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, ఉక్కు పరిశ్రమ నిర్మాణం, పెండింగ్‌ప్రాజెక్టులను పూర్తి చేయడం, ఎర్రచందనం ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయడం జరగాలన్నారు. రాయలసీమలో మూతపడిన పరిశ్రమను తెరిపించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు చాగం రెడ్డి వీరనారాయణరెడ్డి, లక్ష్మీదేవి, మూర్తి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

తెల్లవారగానే.. మద్యం అమ్మేస్తున్నారు

మద్యం దుకాణాలు మూసివేశారనే పరేషాన్ అక్కర్లేదు... రాత్రి పగలు అనే తేడా లేదు. ఏ సమయంలో మద్యం కావాలన్నా ప్రొద్దుటూరులో దొరుకుతుంది. ఒక విధంగా చెప్పాలంటే 24 గంటలపాటు కొన్ని దుకాణాల్లో మద్యం ఉంచారు. మందుబాబుల సౌకర్యార్థం ఎక్సైజ్ అధికారులు, ఇక్కడి వైన్ షాపు యాజమాన్యాలు కలిసి మద్యం అమ్మకాలను సులభతరం చేశారు.

- ఉదయాన్నే తెరచుకుంటున్న మద్యం దుకాణాలు
- తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్న పోలీసులు
- అడ్డగోలుగా మద్యం విక్రయిస్తున్న వ్యాపారులు





ప్రొద్దుటూరులో ఉదయాన్నే తెరచిన మద్యం షాపులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 20 మద్యం దుకాణాలు, ఎనిమిది బార్లు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వీటిని ఆరంభిచేందుకు ఖచ్చితమైన సమయపాలన ఉండేది. ఉదయం పది గంటల తర్వాత తెరచి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిర్ణీత సమయాల్లో విక్రయించారు. రాత్రి 10 గంటల తర్వాత మూసివేయడంతో ఒక్క మద్యం షాపు కనిపించేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రైవేట్ మద్యం దుకాణాలు వెలిశాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ వైన్ షాపుల్లో విక్రయాలు జరగాలి. బార్లకు రాత్రి 11 గంటల వరకు అనుమతి ఉంటుంది.

అయితే ఈ ఆదేశాలు బేఖాతరు చేస్తూ ప్రొద్దుటూరులో కొన్ని మద్యం దుకాణాలు తెల్లవారకముందే తెరచుకుంటున్నాయి. మరీ కొందరు వ్యాపారులు షాపులు రేయింబవళ్లు తెరచి మద్యం విక్రయిస్తున్నారు. వైన్ షాపులు మూసిన తర్వాత అక్కడ పనిచేసే వ్యక్తులు, నైట్ వాచ్‌మెన్ల ద్వారా విక్రయాలు సాగిస్తున్నారు.

ఎక్సైజ్, పోలీస్ అధికారులు ఏం చేస్తున్నారు!

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకుంటారు. అయితే ఎక్సైజ్ శాఖలో మాత్రం దీనికి మినహాయింపు ఉన్నట్లు కనిపిస్తోంది. ఉదయాన్నే తెరచినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదు. వ్యాపారులపై ఉదాసీనత చూపుతూ తమ పని కాదన్నట్లుగా ఇక్కడి పోలీసులు వ్యవహరిస్తున్నారు. కొన్ని నెలల క్రితం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తీవ్ర హెచ్చరికలు చేయడంతో మద్యం దుకాణాల యజమానులు సమయపాలన పాటించారు. ఆ తర్వాత ఏమైందో ఏమో గానీ వైన్‌షాపులను పోలీసులు పూర్తిగా వదిలేశారు. తమ వాళ్లు రాత్రింబవళ్లు మద్యం తాగి ఇళ్లకు వస్తుంటే ఎలా అంటూ మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బార్లను తలపిస్తున్న గదులు

ప్రొద్దుటూరులో ఏది వైన్ షాపు.. ఏది బార్ అనేది గుర్తు పట్టడం కష్టంగా మారింది. బార్లను తలదన్నేలా మద్యం షాపుల్లో పర్మిట్ రూములు ఏర్పాటు చేసుకున్నారు. వాటికి అనుమతి లేకున్నా ఎక్సైజ్ అధికారుల అండతో ప్రతి వైన్ షాపుకు అనుబంధంగా విశాలమై గదులు నిర్వహిస్తున్నారు. పర్మిట్ రూంలలో బార్లను మించి కూర్చొని మందు తాగేందుకు ఏర్పాట్లుచేశారు. మైదుకూరు రోడ్డులోని కొత్తపంచాయతీలో అయితే ఒక మద్యం షాపు యజమాని మైదానంలో విశాలమైన షెడ్ ఏర్పాటుచేశాడు. హైవే పక్కన దాబాలను తలపిస్తున్నాయి. రోడ్డుపై బైక్‌లను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారినా అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. విచ్చలవిడి మద్యం అమ్మకాలకు అనుమతి ఇవ్వడంతో తమ వ్యాపారాలు పడిపోయాయని బార్ల యజమానులు వాపోతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

వైన్ షాపులు, బార్ల నిర్వాహకులు సమయపాలన పాటించకుంటే చర్యలు తీసకుంటాం. ఉదయాన్నే షాపులు తెరచి విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తాం.

– సురేంద్రారెడ్డి, ఎక్సైజ్ సీఐ, ప్రొద్దుటూరు

విరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరించాలి



ఈదురుగాలులకు పడిపోయిన విద్యుత్ స్తంభం

అట్లూరు : మండల కేంద్రమైన అట్లూరులోని మంచినీటి పథకానికి ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం గత రెండు వారాల క్రితంం బలంగా వీచిన ఈదురు గాలులకు విద్యుత్ లైన్‌పై చెట్టు విరిగిపడటంతో విద్యుత్ స్తంభం విరిగిపోయి లైన్ కింద పడిపోయింది. విద్యుత్ లైన్ అట్లూరు నుండి అంకాలమ్మ గుడి, పాత అట్లూరు గ్రామానికి వెళ్లే రహదారిపై అడ్డుగా పడి ఉంది. విద్యుత్ లైన్, స్తంభం పడిపోయి దాదాపు 15 రోజులు దాటుతున్నా ఇంత వరకు పునరుద్ధరించకపోవడం ఏమిటని గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈదురు గాలులు, విపత్తులు సంభవించి విద్యుత్ లైన్, స్తంభాలు పడిపోతే వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా మండల కేంద్రంలోని మంచినీటి పథకానికి ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్, స్తంభం పడిపోయి 15 రోజులు దాటుతున్నా పునరుద్ధరించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. మంచినీటి పథకానికి తాత్కాలికంగా గ్రామ సర్పంచ్ కేబుల్ ఏర్పాటు చేయడంతో మంచినీటి పథకం పనిచేస్తుందన్నారు.